జాతీయ తెలుగు దినపత్రిక
WARANGAL EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

వరంగల్ సోమవారం 8 జూన్ 2026 సంపుటి : 16 సంచిక : 127 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35559

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## తెలంగాణ స్వరానికి
# తొలి గొంతుక

మరుగునపడిన కమాలుద్దీన్ అహ్మద్
ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను పార్లమెంట్‌లో వినిపించిన నాయకుడు..
తగిన గుర్తింపుకు నోచుకోని తెలంగాణ ఉద్యమ యోధుడు

**హన్మకొండ జిల్లా ప్రతినిధి, జూన్ 07, (ప్రజా జ్యోతి):**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాలపాటు సాగిన ఉద్యమ చరిత్రలో కీలక పాత్ర పోషించిన దివంగత నాయకుడు ఎం. కమాలుద్దీన్ అహ్మద్ సేవలకు ఇప్పటికీ తగిన గుర్తింపు లభించలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రాంత ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని దేశం దృష్టికి తీసుకెళ్లిన తొలి నాయకుల్లో ఆయన ఒకరిగా గుర్తింపు పొందారు. గ్రామీణ తెలంగాణలో పెరిగిన కమాలుద్దీన్ అహ్మద్ ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని రాజకీయ జీవితమంతా వారి సంక్షేమానికే అంకితం చేశారు. 1962, 1967లో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, అనంతరం వరంగల్--హన్మకొండ నియోజకవర్గం నుంచి ఎంపీగా సేవలందించారు. కేంద్రంలో సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన, శ్రీరాంసాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి విశేష కృషి చేశారు. 1997లో లోక్‌సభలో జరిగిన చర్చల్లో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఆయన గట్టిగా ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావానికి దాదాపు పదేళ్ల ముందే ప్రత్యేక తెలంగాణ అవసరాన్ని జాతీయ స్థాయిలో వినిపించిన నాయకుడిగా నిలిచారు. అయితే అనంతర కాలంలో రాజకీయంగా ఒంటరితనాన్ని ఎదుర్కొన్న ఆయన క్రమంగా ప్రజా జీవితానికి దూరమయ్యారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో పాండిత్యం కలిగిన కమాలుద్దీన్ అహ్మద్ 2002--04 మధ్య సౌదీ అరేబియాకు భారత రాయబారిగా కూడా సేవలందించారు. 2018లో ఆయన మరణించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించకపోవడం పట్ల పలువురు ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన కమాలుద్దీన్ అహ్మద్‌కు ప్రభుత్వం తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు కోరుతున్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని వారు పేర్కొంటున్నారు.

## పల్లారుగూడలో 'నకిలీ' పురుగు
# మందుల గుట్టురట్టు..!




వ్యవసాయ అధికారి జగదీశ్వర్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు
రూ.1.38 లక్షల విలువైన స్టాక్ సీజ్..యజమానిపై పోలీస్ కేసు

## అధికారుల నిర్లక్ష్యానికి
# పరాకాష్ట..!



శంకుస్థాపనకే పరిమితమైన తట్టుపల్లి హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణం!
రెండేళ్లు గడుస్తున్నా అడుగు ముందుకు పడని వైనం.
పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, జిల్లా వైద్యాధికారులు
గ్రామసభల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేసినా స్పందన కరువు
ప్రభుత్వాలు మారినా మారని తట్టుపల్లి ప్రజల వైద్య కష్టాలు.

## మద్యం మత్తులో వీరంగం

ఒళ్లు తెలియకుండా తాగిన ఏవో
వాహనదారుడి ఆర్సీ చింపే ప్రయత్నం
పనుల కోసం వచ్చిన వారిపై రుసరుస
హనుమకొండ ఆర్టీవోలో ఘటన



**నయీంనగర్, జూన్ 6 :** ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించాల్సిన ఓ ఆఫీసర్ కార్యాలయ వేళలోనే ఫుల్‌గా మద్యం సేవించాడు.. కన్నూమిన్నూ కానకుండా వీరంగం సృష్టించాడు.. తాగిన మత్తులో ఓ వాహనదారుడి ఆర్సీ చింపే ప్రయత్నం చేశాడు.. ఇదంతా ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. సాక్షాత్తు హనుమకొండ జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని రవాణా శాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన నరేందర్ కార్యాలయంలోనే తాగి హంగామా సృష్టించాడు. శనివారం ఉదయం 10.30 గంటలకు తన స్నేహితుడితో కలిసి వచ్చిన ఆయన కార్యాలయ మైదానంలో కారులోనే కూర్చొని మధ్యాహ్నం 2 గంటల వరకు మందు తాగారు. ఈ క్రమంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు చాలాసేపు వేచి చూసిన అనంతరం 'ఏవో సారూ.. ప్లీజ్ రండి.. చాలా దూరం నుంచి వచ్చాం..' అన్నా వినలేదు. అక్కడున్న సిబ్బంది సైతం 'సార్ రండి.. న్యూసెన్స్ అవుతుంది' అని చెప్పినా వినకుండా వీరంగం సృష్టించాడు. వరంగల్ నుంచి రోజుల క్రితం హనుమకొండ ఆర్టీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన నరేందర్ మద్యం మత్తులో వాహనదారులను ఇబ్బందులకు గురి చేయడంతో అందరూ తిరగబడ్డారు. గేట్‌కు తాళం.. ఏవో నరేందర్ చేయాల్సిన పని పెండింగ్ ఉండడం తో సిబ్బంది అతడితో డ్యూటీ చేయించే ప్రయత్నం చేశారు. అయితే మత్తు దిగని ఏవో వచ్చిన వాహనదారులపై ఆగ్రహం వ్యక్తం చేశా డు. 'చెల్ ఇక్కడి నుంచి పోండి.. రేపు రండి చూస్తా' అంటూ ఓ వ్యక్తి వాహనానికి సంబంధించిన ఒరిజనల్ ఆర్సీని చింపే ప్రయత్నం చేశాడు. 'సంతకం పెట్టండి సారూ.. నేను దూరం నుంచి వచ్చిన.. పొద్దటి నుంచి చూస్తున్నా' అని చెప్పినా వినకుండా దుర్భాషలాడాడు. ఏవో చేసిన తతంగం చూసిన అధికారులు, సిబ్బంది తమ పరువు పోతుందని భావించి కార్యాలయం ముందు గేట్‌కు తాళం వేశారు. వెనుక నుంచి దారి ఇచ్చారు. కస్టమర్లు ఎవరొచ్చినా కూడా లోనికి పంపించలేదు. ఏజెంట్లను మాత్రం వెనుక నుంచి అనుమతించి పనులు చేసి పంపించారు. దీంతో వాహనదారులకు సేవలందించాల్సిన అధికారులు ఏజెంట్లకే సహకరిస్తున్నారని పలువురు విమర్శించారు.

# సహకార వ్యవస్థతో సామాజిక, ఆర్థిక మార్పులు సాధ్యం: ట్రైని ఐఏఎస్ అధికారులు





**భీమదేవరపల్లి జూన్ 07 ప్రజా జ్యోతి :** ముల్కనూర్ నమూనా గ్రామీణాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తోందని ఐఏఎస్ శిక్షణాధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీ లో శిక్షణ పొందుతున్న ఆరుగురు ఐఏఎస్ శిక్షణాధికారులు ఆదివారం ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు, పరపతి సంఘాన్ని సందర్శించి సంఘం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన నిర్వాహక అధికారి (జీఎం) రామ్‌రెడ్డి సొసైటీ గురించి వారికి క్లుప్తంగా వివరించారు.ముల్కనూర్ సహకార సంఘం గత ఆరు దశాబ్దాలుగా రైతులు, గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధికి సేవలందిస్తోందని తెలిపారు. సభ్యులకు రుణ సదుపాయాలు, వ్యవసాయ సేవలు, బీమా పథకాలు, విత్తనోత్పత్తి, మార్కెటింగ్ కార్యక్రమాలు అందిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామని వివరించారు. అనంతరం సంఘ ఉద్యోగులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ చరిత్ర, అభివృద్ధి ప్రస్థానం, వివిధ సేవలపై శిక్షణాధికారులకు వివరించారు. ఈ సందర్భంగా శిక్షణాధికారులు అడిగిన పలు ప్రశ్నలకు సంఘ అధికారులు సమగ్ర సమాధానాలు ఇచ్చారు. ముల్కనూర్ సహకార సంఘం సామాజిక మూలధనాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక మార్పులకు దోహదపడుతోందని ఐఏఎస్ శిక్షణాధికారులు అభిప్రాయపడ్డారు. నిబద్ధత కలిగిన నాయకత్వం, పరస్పర విశ్వాసం, సభ్యుల భాగస్వామ్యంతో సహకార వ్యవస్థ విజయవంతంగా కొనసాగుతోందని కొనియాడారు. ముల్కనూర్ నమూనా నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం సంఘ ప్రధాన నిర్వాహక అధికారి రామ్‌రెడ్డి, రుణ విభాగాధిపతి రాజమౌళి ఐఏఎస్ శిక్షణాధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహాయ ప్రధాన నిర్వాహక అధికారి (ఏజీఎం) సతీష్, సీనియర్ మేనేజర్ వెంకటేశ్వరరావు, రుణ విభాగాధిపతి రాజమౌళి, సంఘంలోని ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# పీవీ విజ్ఞాన వేదిక దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది: ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**భీమదేవరపల్లి జూన్ 07 ప్రజా జ్యోతి :** భారత రత్న, మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు స్వగ్రామం వంగరలో నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక పీవీ విజ్ఞాన వేదిక అభివృద్ధి పనులను కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా ) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో పీవీ విజ్ఞాన వేదిక పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, పీవీ నర్సింహారావు వారసత్వాన్ని భావితరాలకు చేరవేసే విధంగా కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పీవీ విజ్ఞాన వేదికలో నిర్మిస్తున్న ఆడిటోరియం, సెమినార్ హాల్, ఫోటో గ్యాలరీ, ధ్యాన కేంద్రం, సైన్స్ మ్యూజియం పనులను పరిశీలించిన ఆయన, నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పీవీ జీవిత విశేషాలు, దేశానికి ఆయన అందించిన సేవలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేస్తున్న గ్యాలరీ సందర్శకులను ఆకట్టుకునేలా ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించేందుకు సైన్స్ మ్యూజియం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వంగరను విద్యా, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, పీవీ విజ్ఞాన వేదిక పూర్తయిన తర్వాత దేశం నలుమూలల నుంచి సందర్శకులు వచ్చే అవకాశముందని ఆయన తెలిపారు.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం జరిగేనా?

## తహసీల్దార్ కార్యాలయంలో నెలల తరబడి పెండింగ్‌లో ఫైళ్లు దరఖాస్తుదారుల ఆందోళన



**ధర్మసాగర్, జూన్?06(ప్రజాజ్యోతి)** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో చాలా కాలంగా వివిధ రకాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల స్థానిక తహసీల్దార్, మండల గిర్దావర్ బదిలీ కావడంతో కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిస్థితి ఏమవుతుందనే ఆందోళన దరఖాస్తుదారుల్లో వ్యక్తమవుతోంది. భూమి సంబంధిత వ్యవహారాలు, వారసత్వం, పట్టాదారు పాస్‌బుక్ మార్పులు, రెవెన్యూ ధ్రువపత్రాలు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కొంతమంది దరఖాస్తుదారులకు తమ ఫైళ్లు కనిపించడం లేదని, కొన్ని ఫైళ్లు మిస్ అయ్యాయని కార్యాలయ సిబ్బంది చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే అన్ని పత్రాలు సమర్పించి నెలల తరబడి ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు, మళ్లీ కొత్తగా ఫైళ్లు సిద్ధం చేయాలంటే మరింత సమయం, ఖర్చు భరించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు పాత దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తారా, లేక మరింత కాలం పెండింగ్‌లో ఉంచుతారా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, ఫైళ్లను గుర్తించి త్వరగా పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు. కొత్త అధికారులు ఈ సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# విద్యుత్ షాక్ తో రెండు ఆవులు మృతి

## సుమారు 1 లక్ష 70వేల నష్టం

## నష్టపరిహారం చెల్లించాలి

## సర్పంచ్ పొనగంటి ముత్తమ్మ



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి ,జూన్ 7.** విద్యుత్ షాక్ తో రెండు ఆవులు మృతి చెంది సుమారు 1లక్ష 70 వేల నష్టం జరిగిన సంఘటన ఆలస్యంగా తెలిసింది.భూపాలపల్లి మండలం బావు సింగ్ పల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని లక్ష్మీ పురం గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది.బాధిత నిరుపేద రైతు దేదావత్ స్వామి,గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం మేత కోసం గ్రామ సమీప పోలాల వద్దకు వెళ్లిన రెండు ఆవులు మేత మేస్తూ ట్రాన్స్ ఫార్మర్ విద్యుత్ వైర్లను తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాయి.ఘటనలో తమకున్న విలువైన పశుసంపద కోల్పోయిన రైతు స్వామి కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడున్న వారిని కలచివేసింది. నష్టపరిహారం చెల్లించాలి:

సర్పంచ్ పొనగంటి ముత్తమ్మ

నిరుపేద రైతు దేదావత్ స్వామి కి నష్టపరిహం చెల్లించాలని

బావు సింగ్ పల్లి సర్పంచ్ పొనగంటి ముత్తమ్మ ప్రభుత్వాన్ని,సంబంధిత అధికారులను కోరారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన నిరుపేద రైతు దేదావత్ స్వామి కి చెందిన రెండు ఆవులు విద్యుత్ షాక్ తో మృతి చెందడం తో విషయం తెలుసుకున్న సంఘటన స్థలానికి చేరుకొని రైతు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. రెండు ఆవుల మృతి తో స్వామి కుటుంబం రోడ్డున పడిందని కావున పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతుకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

# అనంతసాగర్‌లో ఉచిత వైద్య శిబిరం

150 మందికి ఆరోగ్య పరీక్షలు.. మందుల పంపిణీ



**హసన్‌పర్తి, జూన్ 7(ప్రజాజ్యోతి):** హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రామంచ వెన్నెల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సుమారు 150 మంది గ్రామస్థులకు వైద్యులు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సూచనలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెన్నెల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సేవా దృక్పథంతో శిబిరాన్ని నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో జనరల్ సర్జన్ డాక్టర్ అశ్రీత్ రెడ్డి, ఛాతీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ శృతి రెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ వికాస్‌రావు,హెడ్ నర్స్ మధు దంపి, నిర్వహణ బాధ్యులు గిన్నరపు రాజు, వంశీ, పరిపాలన విభాగానికి చెందిన సందీప్, గ్రామస్థులు, యువకులు, మహిళలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిషేధిత అంబర్ గుట్కా ప్యాకెట్ల స్వాధీనం




**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 07 (ప్రజా జ్యోతి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులపై నిర్వహించిన తనిఖీలలో భాగంగా భూపాలపల్లి మండలం ఖాసింపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ వద్ద నుండి అంబర్ గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.మొత్తం 6 సంచుల్లో, ఒక్కో సంచిలో 200 ప్యాకెట్ల చొప్పున మొత్తం 1,200 ప్యాకెట్లు లభించగా, వాటి విలువ సుమారు రూ. 1,92,000 గా అంచనా వేసారు.స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను పోలీస్ స్టేషన్ తరలించారు.నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ ఉంచడం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# 10న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి: ఆదరి శ్రీనివాస్



**భీమదేవరపల్లి జూన్ 07 ప్రజా జ్యోతి :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ ఈ నెల 10న నిర్వహించే హన్మకొండ జిల్లా కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడిలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు

అండగా నిలిచిన మంత్రి సీతక్క



ములుగు జూన్ 07 (ప్రజా జ్యోతి):ములుగు మండలంలోని పంచోత్కులపల్లి గ్రామానికి చెందిన ఆగబోయిన నిరోష ఇటీవల వడదెబ్బతో మృతి చెందింది.ఆమె కుమారులు రిషి,అభి అనాథలయ్యారు. 2019లో తండ్రి శోభన్ సైతం మృతిచెందడంతో ఆ చిన్నారులు దిక్కులేనిస్థితిలో ఉన్నారు.వారిని పంచాయతీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదివారం పరామర్శించి రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ. 4 వేల చొప్పున సహాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు గురుకుల పాఠశాలలో విద్యాభ్యాసం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు భద్రతా దళ జవాన్‌గా ఆశా వర్కర్ కుమారుడు చరణ్ కుమార్!

**చేసిన సహాయం మరువక, ఆశీర్వాదం కోసం వచ్చిన యువ జవాన్..**

**దేశ సేవ చేసే భాగ్యం దక్కడం గర్వకారణం: సమ్మిగౌడ్ చిలువేరు.**

**అండగా ఉంటాను ఐపిఎస్ గా ఎదగాలి..గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్..**





**కేసముద్రం,జూన్ 07(ప్రజాజ్యోతి):** పేదరికం చదువుకు అడ్డంకి కాదని, పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాన్నైనా అధిరోహించవచ్చని నిరూపించాడు. ఆ యువకుడు. కేసముద్రం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చింతకుంట్ల చరణ్ కుమార్ (19సం") అతి చిన్న వయసులోనే సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఉద్యోగం సాధించి, తన కుటుంబానికి, గ్రామానికి తీరని కీర్తిని తీసుకువచ్చాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చరణ్ కుమార్ ఉద్యోగం సాధించిన అనంతరం, ప్రముఖ సామాజిక నాయకులు సమ్మిగౌడ్ చిలువేరును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. స్వయంకృషితో సాధించిన విజయం.. యువతకు ఆదర్శం: చరణ్ కుమార్ తండ్రి చింతకుంట్ల ముత్తయ్య తాపీ మేస్త్రిగా,తల్లి పుష్పలత ఆశా వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎంతో సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చరణ్ కుమార్, నిత్య జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమించి స్వయంకృషితో ఈ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం విశేషం. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ మాట్లాడుతూ.."పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఓర్చి దేశ సేవ చేసే స్థాయికి చేరుకోవడం చాలా గొప్ప విషయం. చరణ్ కుమార్ సాధించిన ఈ విజయం గ్రామంలోని ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తుంది" అని కొనియాడారు.బిఎస్ఎఫ్ తో ఆగకుండా భారతీయ పోలీస్ సర్వీస్ ఉద్యోగం ఐపిఎస్ సాధించాలని,

చరణ్ కుమార్ ఇక్కడితోనేఆగిపోకుండా, భవిష్యత్తులో ఉన్నతమైన భారతీయ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారిగా ఎదగాలనే లక్ష్యంతో మరింత కష్టపడాలని సమ్మిగౌడ్ ఆకాంక్షించారు. ఆ లక్ష్య సాధనలో విద్యాపరంగా, మార్గదర్శకత్వం పరంగా ఎలాంటి సహాయం అవసరమైనా తానే పెద్దన్నగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పెద్ద దిక్కుగా నిలిచిన సమ్మిగౌడ్: గత ఎన్నో సంవత్సరాలుగా ఆశా వర్కర్ల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, వారికి అండగా నిలుస్తున్న సమ్మిగౌడ్ పట్ల చరణ్ కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి కూడా పెద్ద దిక్కుగా ఉంటూ, అనేక సందర్భాల్లో చరణ్ విద్యాభ్యాసంపై, భవిష్యత్తుపై ఎప్పటికప్పుడు ప్రోత్సాహం అందించారని వారు భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు.

మామయ్య ఆశీస్సులు మరిన్ని బాధ్యతలను పెంచాయి: చరణ్ కుమార్ బీఎస్ఎఫ్ ఉద్యోగం సాధించిన తర్వాత నా తల్లి స్వంత అన్నగా భావించే సమ్మిగౌడ్ మామయ్య ఆశీర్వాదం తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చరణ్ కుమార్ తెలిపారు. ఆయన చూపిస్తున్న ఆదరణ, ప్రోత్సాహం తనపై మరింత బాధ్యతను పెంచాయని, భవిష్యత్తులో ఖచ్చితంగా ఐపీఎస్ సాధించి దేశానికి మరింత సేవ చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సమ్మిగౌడ్ చరణ్ కుమార్‌ను ఘనంగా శాలువాతో సత్కరించి, దేశ సేవలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని దీవించారు.

# ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తాం.

**ఈనెల 10న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను విజయవంతం చేయాలి.**

**సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా.**




**వర్దన్నపేట, జూన్ 7,ప్రజా జ్యోతి.** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని, ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా పిలుపునిచ్చారు. వర్దన్నపేటలో సీపీఐ మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం కడమంచి యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన షేక్ బాష్ మియా మాట్లాడుతూ రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, సామాన్య ప్రజలు జీవనం సాగించడం కష్టతరంగా మారిందన్నారు. బియ్యం, పప్పులు, వంట నూనెలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్‌తో పాటు కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌ను అతలాకుతలం చేస్తున్నాయని పేర్కొన్నారు. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. పెరుగుతున్న ధరల కారణంగా పేద ప్రజల జీవనం మరింత దుర్భరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సబ్సిడీపై రేషన్ సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌పై విధిస్తున్న పన్నులను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. మార్కెట్‌లో నల్లబజారు, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ జూన్ 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఆరెల్లి రవి, మండల సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు, ఆరెల్లి ప్రభాకర్, రాజు, యాకుబ్, తాటికాయల మహేందర్, రామకృష్ణ, గణేష్, ఐలయ్య, గోలి యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పల్లారుగూడలో 'నకిలీ' పురుగు మందుల గుట్టురట్టు..!

**వ్యవసాయ అధికారి జగదీశ్వర్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు**

**?-రూ.1.38 లక్షల విలువైన స్టాక్ సీజ్..యజమానిపై పోలీస్ కేసు**




**సంగెం,జూన్07(ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని పల్లారుగుడ గ్రామంలో గడువు ముగిసిన,నకిలీ పురుగుల మందులను విక్రయిస్తున్న మహేశ్వర ఏజెన్సీపై వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 1.38 లక్షల విలువైన క్రిమిసంహారక మందులను అధికారులు సీజ్ చేశారు. ?మండల వ్యవసాయ అధికారి (వీూూ) పి. జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... పల్లారుగుడ గ్రామంలోని "మహేశ్వర ఏజెన్సీస్" లో నకిలీ, కాలం చెల్లిన మందులు అమ్ముతున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో వ్యవసాయ అధికారి తన సిబ్బందితో కలిసి సదరు దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ?ఈ తనిఖీల్లో రైతులకు విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన పారాక్వాట్ హెర్బిసైడ్, సూపర్ కిల్లర్, అట్రాజిన్, విడిగో, వజ్రం, నానో డీఏపీ, తేజస్, వీనస్ వంటి దాదాపు 21 రకాలకు చెందిన 213 పురుగుల మందుల బాటిళ్లు/ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. వీటి మొత్తం విలువ రూ. 1,38,904/- లుగా నిర్ధారించి, పంచుల సమక్షంలో వాటిని స్వాధీనం (ూవఅఓవ) చేసుకున్నారు.

**?యజమానిపై పోలీస్ కేసు..**

?క్రిమిసంహారక మందుల చట్టం 1968 లోని సెక్షన్ 10 ూ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను... మహేశ్వర ఏజెన్సీస్ యజమాని, పల్లరిగూడ గ్రామానికి చెందిన నీలపల్లి హరి (తండ్రి: వెంకటేశ్వర్లు) పై సంగెం పోలీస్ స్టేషన్‌లో చట్టపరమైన చర్యలకై వ్యవసాయ అధికారి జగదీశ్వర్ ఫిర్యాదు చేశారు.

**?వ్యవసాయ అధికారి హెచ్చరిక:**

"రైతుల ప్రాణాలతో, పెట్టుబడులతో ఆడుకుంటూ నకిలీ, గడువు ముగిసిన మందులను విక్రయిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ప్రతి పురుగుల మందుల దుకాణదారుడు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. రైతులు కూడా మందులు కొనేటప్పుడు గడువు తేదీలను గమనించాలి." అని మండల వ్యవసాయ అధికారి పి. జగదీశ్వర్ పేర్కొన్నారు

## భూపాలపల్లి గడ్డ పై టి .ఆర్.ఎస్ జెండా ఎగురవేత.



**భూపాల్ పల్లి టౌన్, ప్రజా జ్యోతి ,జూన్** 7.తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల.కవితక్క ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో తెలంగాణ రక్షణ జెండా పండుగ కార్యక్రమం నరేష్ నేత ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రాష్ట్ర అబ్జర్వర్ మేడల అభిలాష గౌడ్ పాల్గొన్నారు.. నరేష్ నేత మాట్లాడుతూ కవితక్క గారు ప్రకటించిన పాంచ జన్యం హామీలు వివరించడం జరిగింది...ఉచిత విద్య, వైద్యం, ఉపాధి,వ్యవసాయం, సామాజిక న్యాయం గురించి మాట్లాడటం జరిగింది.. ఈ కార్యక్రమంలో జిల్లా అబ్జర్వర్ వల్లకొండ అజయ్ రెడ్డి మరియు రాష్ట్ర నాయకులు సిద్దిక్.షేక్, బుర్ర వినోద్, గోవర్ధన్, సంతోష్ మరియు ఉద్యమ నాయకురాలు భారతమ్మ,పద్మ లత, యూత్ నాయకులు లడ్డు,సన్నీ, విద్యార్థి నాయకులు విగ్నేష్, శివ, హెచ్ ఎమ్ ఎస్ యూనియన్ నాయకులు చుక్క. రాజు, రాజకుమార్, అవినాష్, సిరాజ్, సునీల్, నరేష్ మరియు పెద్ద ఎత్తున స్థానికమహిళలు,తదితరులు పాల్గొన్నారు..

## ప్లాస్టిక్ వాడకం గ్రామంలో నిషేధిస్తున్నాం

గాంధీనగర్ గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):**ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీలో ఆదివారం గ్రామస్తులతో కలిసి గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించారు.అనంతరం గ్రామ సర్పంచ్ నిర్మల వెంకన్న మాట్లాడుతూ.. గాంధీనగర్ గ్రామంలోని యువకులు మహిళలు వివిధ కమిటీల అధ్యక్ష కార్యదర్శులు నాయకులతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించామని,గ్రామంలో ప్లాస్టిక్ వాడకం నిషేధిస్తున్నామని గతంలోనే ప్రతిజ్ఞ చేశామని తెలిపారు. బాల్య వివాహ రహిత గ్రామంగా అధికారులు గుర్తించారని,ఆఉత్సాహంతో గ్రామంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేసి అందరికీ ఆదర్శంగా నిలుస్తామన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్,వార్డు సభ్యులు మాలోత్ శంకర్,కూరాకుల సురేష్,రామావత్ సంధ్య బిక్షపతి,గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బానోత్ వెంకన్న,కార్యదర్శి రమావత్ బిక్షపతి,ఆరోగ్య కమిటీ అధ్యక్షుడు ఐలయ్య, కార్యదర్శి వెంకన్న,వాటర్ కమిటీ అధ్యక్షుడు కిరణ్, విద్యాకమిటీ అధ్యక్షుడు బెల్లి సురేష్,పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు బానోత్ ఖాసీం,గ్రామ పెద్దలు బానోత్ బాలు,లావుడ్య బాలు, కొంపెల్లి శ్రీను,పల్లె మల్లయ్య, బానోత్ జోగ్య,భూక్య రాజేందర్ లావుడ్య జింతు, తేజావత్ బన్ను,కొంపెల్లి అశోక్,బాలవికాస సంస్థ ప్రతినిధులు వినయ్,శంకర్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మరిపెడ,జూన్7(ప్రజాజ్యోతి)** మరిపెడ పట్టణంలో 2002-03 విద్యా సంవత్సరానికి చెందిన వివేకానంద పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ..పూర్వ విద్యార్థుల కలయికలు పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ పరస్పర అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల అనుభవాలను,మధుర స్మృతులను ఒకరితో ఒకరు పంచుకుని ఆనందంగా గడిపారు.తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దూగుంట్ల వెంకన్న,గంధసిరి రమేష్, రవీందర్,యాకుబ్,డేవిడ్,బొడ్డు సంపత్,లక్ష్మణ్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పిల్లలతో క్రికెట్ ఆడి సందడి చేసిన ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్



**మరిపెడ,జూన్7(ప్రజాజ్యోతి)** నిత్యం ప్రజా సమస్యలు, అధికారిక కార్యక్రమాలు,నియోజకవర్గ అభివృద్ధి పనులతో బిజీగా ఉండే ప్రభుత్వ విప్, డాక్టర్ రాంచందర్ నాయక్ మరిపెడలో కాసేపు ఆటవిడుపుగా గడిపారు. స్థానికంగా పిల్లలతో కలిసి క్రికెట్ ఆడుతూ సందడి చేశారు. బ్యాట్ పట్టి షాట్లు కొడుతూ చిన్నారులతో కలిసి ఉత్సాహంగా ఆడిన ఎమ్మెల్యేను చూసి స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ప్రజా సేవలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, అప్పుడప్పుడు పిల్లలతో కలిసి సరదాగా గడపడం మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఎమ్మెల్యేతో కలిసి క్రికెట్ ఆడిన చిన్నారులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ అభిమాన నాయకుడు తమతో కలిసి ఆడటం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నాం

# చిన్నారి శ్రీకృతిని ఆశీర్వదించిన సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్



**చెన్నారావుపేట జూన్ 7( ప్రజా జ్యోతి )** మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన ఆంధ్రప్రభ విలేకరి ముత్యం రాజు-సుప్రియ దంపతుల కుమార్తె నూతన వస్త్ర ఫల అలంకరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొని చిన్నారి శ్రీకృతిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, నాయకులు వీరు, శివ, అశోక్, కొమురయ్య, లక్ష్మి, అనూష తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

**చెన్నారావుపేట జూన్ 07 (ప్రజా జ్యోతి)**



రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న ప్రైవేటు పాఠశాలల ఫీజులను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని జాతీయ మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షుడు మంద నరేష్, ప్రధాన కార్యదర్శి నూనె తిలక్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థలు లాభార్జనే ధ్యేయంగా సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులను ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాల ప్రాంగణాల్లోనే రెట్టింపు ధరలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు విక్రయిస్తూ దోపిడీకి తెరలేపారని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**చెన్నారావుపేట జూన్ 07( ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని పాపయ్యపేట రహదారి జోజిపేట సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో గుండెంగా గ్రామానికి చెందిన బాదావత్ హరిసింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పైలెట్ నాగరాజు ఈఎంటి అనిత క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# దివంగత ఎం. లలిత ఎస్. రావు జ్ఞాపకార్థంగా కుమారుడు అజయ్, కోడలు పౌలినా సేవా కార్యక్రమం




**తరిగొప్పుల జూన్ 7 ప్రజాజ్యోతి** :తరిగొప్పుల మండల కేంద్రంలోని అక్కరాజుపల్లి, నర్సాపూర్, అంకుశాపూర్ గ్రామాల్లో డా. హెలెన్ మేరీ ఆధ్వర్యంలో దివంగత ఎం. లలిత ఎస్. రావు జ్ఞాపకార్థంగా పేద వితంతువులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె కుమారుడు అజయ్, కోడలు పౌలినా చేపట్టి అవసరంలో ఉన్న మహిళలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఒక నెలకు సరిపడా బియ్యం, పప్పులు, వంట నూనె, సబ్బులు తదితర నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వితంతువులకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అక్కరాజుపల్లి గ్రామం లో రెయిన్బో యూత్ అసోసియేషన్ సభ్యులు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా రెయిన్బో యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, సమాజంలో అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం గొప్ప విషయమని, సేవా కార్యక్రమానికి సహకరించిన డా. హెలెన్ మేరీ ముద్దమల్లె సేవా భావాన్ని అభినందించారు. అనంతరం ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల వేళంగిణి పాస్టర్ గుండె జాషువా రెయిన్బో యూత్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భోగం అనూప్, అంకం రాజు,సభ్యులు మంచినీళ్ల హరి బండ మధు, కృష్ణ కుమార్, నాగరాజు, రాజేష్ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు. అవసరమైన వారికి అండగా నిలవడం ద్వారా దివంగత లలిత గారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# శ్రీరాం రమేష్ సేవలు చిరస్మరణీయం.

మున్సిపల్ చైర్మన్ సారంగపాణి



**వర్ధన్నపేట, జూన్ 7,ప్రజా జ్యోతి.**వరంగల్ జిల్లా, వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్ట్ శ్రీ రాం రమేష్ దశదిన కర్మ కార్యక్రమం స్థానిక ఏబీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి హాజరై శ్రీ రామ్ రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయన జర్నలిజం రంగంలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి సామాజిక బాధ్యతతో వార్తలను అందించిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రమేష్ అకాల మరణం జర్నలిస్టు లోకానికి మాత్రమే కాకుండా వర్ధన్నపేట ప్రాంత ప్రజలకు కూడా తీరని లోటని అన్నారు.అనంతరం రమేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన చైర్మన్ సారంగపాణి, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి-రాజేందర్, వార్డు కౌన్సిలర్ నునవత్ కమిలి-కిమా నాయక్, బెజ్జం పాపరావు, కాంగ్రెస్ నాయకులు సమ్మెట సుధీర్ కుమార్, సోములు, లోడి, రమేష్, సురేష్, శ్రీను, మోతీలాల్, మంగ్య, నేతావత్ యాకన్న, బానోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై రాం రమేష్ సేవలను స్మరించుకున్నారు.చివరగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ పలువురు నివాళులర్పించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు





**వర్ధన్నపేట, జూన్ 7,ప్రజా జ్యోతి.**వర్ధన్నపేట మున్సిపల్ కేంద్రంలోని 7వ డివిజన్‌కు చెందిన ఇలబెల్లి సురేందర్ (40) ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు ఆయనను హనుమకొండలోని రోహిణి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఏఅదేవిధంగా పట్టణంలోని 11వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాడిశెట్టి లక్ష్మణ్ అమ్మమ్మ పొడిశెట్టి వెంకటలక్ష్మి (95) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందిన విషయం తెలుసుకుని నాయకులు ఆమె నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు తిరుపతి సురేష్, సిలివేరు కుమారస్వామి యాదవ్, గుజ్జ వీరరాఘవరావు, మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి పాల్గొన్నారు. వీరితో పాటు సీనియర్ నాయకులు తుమ్మల యాకయ్య, పూజారి రఘు, సిలివేరు రాజ్‌కుమార్ యాదవ్, మాడిశెట్టి లక్ష్మణ్, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ సిలివేరు శ్రీధర్ యాదవ్, ఎలికట్టె యాకయ్య, ఇలబెల్లి ఆనందం, మాజీ సర్పంచ్ కర్ర వెంకట్‌రెడ్డి, పిట్టల రాజు, మల్లెపాక అనిల్, దీకొండ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# గోపాలపూర్ క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం వృద్ధుడికి తీవ్ర గాయాలు






భీమదేవరపల్లి జూన్ 07 ప్రజా జ్యోతి : మండలంలోని జాతీయ రోడ్డు గోపాలపూర్ క్రాస్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గోపాలపూర్ నుంచి ముల్కనూర్ వైపు ట్రాలీ (అప్పి) బండి మలుపు తిరుగుతుండగా, ఎలకతుర్తి గ్రామానికి చెందిన అంబాల కొమురయ్య (60) తన స్కూటీపై ముల్కనూర్ నుంచి ఎలకతుర్తి వైపు వెళ్తున్న సమయంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొమురయ్య ఎడమ కాలు మోకాలి వద్ద విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అనంతరం బాధితుడిని హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న ముల్కనూర్ ఎస్ఐ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. గోపాలపూర్ క్రాస్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు అధికారులు తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇండియన్ ఆర్మీకి ఎంపికైన విజయ్‌కు అభినందనలు



**మరిపెడ,జూన్7(ప్రజాజ్యోతి)** మరిపెడ పట్టణంలోని 2వ వార్డు పరిధిలోని ఈదులవాగు తండాకు చెందిన బానోతు బాల కుమారుడు విజయ్ ఇండియన్ ఆర్మీకి ఎంపిక కావడంతో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు దేశ రక్షణ కోసం భారత సైన్యంలోఎంపికకావడంగర్వకారణమని అన్నారు. విజయ్ కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించాడని కొనియాడారు.యువత విజయ్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.విజయ్ కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన చైర్‌పర్సన్, భవిష్యత్తులో మరిన్నిఉన్నతశిఖరాలుఅధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు, వార్డు ప్రజలు విజయ్‌కు అభినందనలు తెలిపారు.

# సర్కారు బడుల్లోనే కార్పొరేట్ స్థాయి విద్య..

**ప్రభుత్వ పాఠశాలలో 'బడి బాట' ప్రారంభం** కేసముద్రం, జూన్ 07(ప్రజాజ్యోతి):సర్కారు బడుల్లోనే కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్,పిఎసిఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. ఆదివారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌లో 'బడి బాట' కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు.ప్రతిభావంతులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ స్థాయికి తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు.



# కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

**కేసముద్రం, జూన్ 07(ప్రజాజ్యోతి):** మోడీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 10న జరిగే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ అన్నారు. ఆదివారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బిజెపి నరేంద్ర మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. గత 12 ఏళ్లలో నరేంద్ర మోడీ బిజెపి సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందన్నారు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువకులను మోసం చేశారని అన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని అంబానీలకు అప్పజెప్పి కార్పొరేట్లకే రెడ్ కార్పెట్ వేస్తున్నాడన్నారు విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాడన్నారు నిత్యవసర సరుకులను రోజు,రోజుకు పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తున్నాడు అన్నారు ఒకవైపు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను విపరీతంగా పెంచాడన్నారు ఎన్నికల్లో ఓట్లు వేసుకొని ఇప్పుడు ఇష్టారించిన రేట్లు పెంచుతున్నాడు అన్నారు, 12 ఏళ్ల మోడీ పరిపాలనలో దేశంలో 140 కోట్ల మంది ప్రజలు పూర్తిగా ఇబ్బందుల పాలవుతున్నారని మోడీ దేశానికి చేసిందేమీ లేదని వచ్చే ఎన్నికల్లో మోడీకి పతనం తప్పదు అన్నారు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమవుతుందన్నారు మహిళలకు 2500 ఇంతవరకు ఇవ్వలేదని 4 వేల పెన్షన్ వృద్ధులకు వితంతువులకు పెంచలేదన్నారు కొర్రీలు పెడుతూ ఇందిరమ్మ ఇల్లు సరిగా ఇవ్వడం లేదని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.




# నేడు చెల్పూర్ లో విద్యుత్ అంతరాయము

**గణపురం ప్రజాజ్యోతి జూన్ 07**
08.06.2026 సోమవారం రోజున ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గం సాయంత్రం 4:00 గంటల నుండి 06:00 గంటల వరకు చెల్పూర్ సబ్ స్టేషన్ లో విద్యుత్ మరమ్మతులు చెయ్యడం జరుగుతోంది, అట్టి సబ్ స్టేషన్ పరిధి లోని విద్యుత్ వినియోగ దారులకు విద్యుత్ అంతరాయం ఉంటుంది విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ ఏఈ వెంకటరమణ తెలిపారు.



# ఆడపిల్ల పుడితే ఉచిత వైద్యం అందిస్తాం

**కొత్తూరు గ్రామంలో కూరపాటి ఫౌండేషన్ గుడ్ మార్నింగ్ ముద్దుబిడ్డ**

**ఆడపిల్లను పుట్టనిద్దాం అవనిపై బ్రతకనిద్దాం**

**డాక్టర్ కూరపాటి రాధిక గైనకాలజిస్ట్ కూరపాటి ఫౌండేషన్**




**రాయపర్తి జూన్ 7 ప్రజా జ్యోతి** మహిళల ఆరోగ్యం పై ప్రతి కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కురపాటి ఫౌండేషన్ డాక్టర్ రాధిక అన్నారు. ఆడపిల్ల పుడితే మా ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తామని అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తూరు గ్రామంలో గుడ్ మార్నింగ్ ముద్దుబిడ్డ కార్యక్రమాన్ని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో కూరపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ ముద్దుబిడ్డ కార్యక్రమాన్ని ఆదివారం కొత్తూరు గ్రామ సర్పంచ్ స్వప్న సంతోష్ కందికట్ల ప్రారంభించారు. కూరపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కూరపాటి రాధిక మేడం దేశంలోనే మొదటిసారిగా గర్భిణీ స్త్రీల వద్దకు డాక్టర్ వెళ్లి పరీక్షించడం జరిగింది. ముద్దుబిడ్డ కార్యక్రమం లో భాగంగా కొత్తూరు గ్రామంలో ఉన్న గర్భిణీ స్త్రీలను ఇంటింటికి వెళ్లి వారి యొక్క ఆరోగ్యంపై ఆరా తీస్తూ భ్రూణ హత్యలు ,ఆడపిల్లను పుట్టనిద్దాం అవనిపై బ్రతకనిద్దాం అనే నినాదంతో ఆడపిల్లల యొక్క ఔన్నత్యాన్ని అదేవిధంగా మా హాస్పిటల్లో ఆడపిల్ల పుడితే ఉచిత వైద్యం అందిస్తామని గ్రామ ప్రజలకు తెలియజేస్తూ గ్రామంలో ఉన్న ఏడుగురు గర్భిణీ స్త్రీలను ఇంటింటికి వెళ్లి ఆరోగ్యాన్ని పరిశీలించి పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూరపాటి ఫౌండర్ చైర్మన్ డాక్టర్ కూరపాటి రమేష్ గ్రామ ఉపసర్పంచ్ చిప్ప శ్రీనివాస్ , ప్రోగ్రాం కోఆర్డినేటర్ బోట్ల మహర్షి

వార్డు సభ్యులు నాగరాణి భాస్కర్, చిర్ర నాగరాజు, భీమని అపర్ణ.. అంగన్వాడి టీచర్ నోముల రమాదేవి... ఆశ వర్కరులు గాదె రజిత , నరసమ్మ కారోబార్ కందికట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యమే లక్ష్యంగా రామన్నగూడెం

# రహదారిపై చెట్ల కొమ్మల తొలగింపు

**ఏటూరునాగారం, జూన్ 7 ప్రజా జ్యోతి** ప్రజల రాకపోకలకు, రైతుల వ్యవసాయ అవసరాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేలా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రామన్నగూడెం రహదారిపై ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు, 7వ వార్డు సభ్యుడు మదారి మధు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. రహదారిపైకి విస్తరించిన చెట్ల కొమ్మల కారణంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను వాహనాల ద్వారా తరలించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, సాధారణ ప్రజల రాకపోకలకు కూడా ఆటంకం ఏర్పడుతోంది. ముఖ్యంగా బస్సులు, వ్యవసాయ వాహనాలు, అంబులెన్స్ వంటి అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో వెంటనే స్పందించి చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత మాట్లాడుతూ, ప్రజల భద్రత, రైతుల సౌకర్యం, రవాణా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులు నిరంతరం చేపడుతున్నామని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్వతాలు ఎల్లయ్య, 4వ వార్డు సభ్యుడు ఎంపెల్లి రాజు (బాబా), గ్రామపంచాయతీ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.



చెట్ల కొమ్మల తొలగింపుతో రహదారి విశాలంగా మారి, ప్రజలు మరియు రైతులకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించబడిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# ఏటూరునాగారంలో అభివృద్ధి జోరు

**కాంగ్రెస్ ప్రభుత్వ కృషి ఫలితమే**

**జిల్లా కార్యదర్శి.గుడ్ల దేవేందర్**

**ఏటూరునాగారం, జూన్ 7 ప్రజా జ్యోతి** ఏటూరునాగారం మండల పరిధిలో ప్రస్తుతం కనిపిస్తున్న అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా రాష్ట్ర మంత్రి సీతక్క చేస్తున్న కృషికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఏటూరునాగారంలోని వివిధ వార్డులు, కాలనీలు, గల్లీల్లో సైడ్ డ్రైనేజీ నిర్మాణాలు, సీసీ రోడ్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదురుచూసిన మౌలిక సదుపాయాల కల ఇప్పుడు నెరవేరుతోందని అన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం, సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందని దేవేందర్ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి సంబంధించిన పలు కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వాలు చేయలేని అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రజల అవసరాలను గుర్తించి పారదర్శక పాలన అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఏటూరునాగారం ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కృషి ఫలితమేనని గుడ్ల దేవేందర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఏటూరునాగారాన్ని ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.



# ప్రభుత్వం పింఛన్లు వెంటనే విడుదల చేయాలి

**ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలి.**

**సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్**

**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, జూన్ 7.** భూపాలపల్లి పట్టణంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాలా కాలం గడిచినా వేలాది మంది వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు సంబంధించిన పింఛన్లను మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించారని, కానీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు కొత్త పింఛన్ల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు జీవనోపాధి కోసం ప్రభుత్వ పింఛన్లపై ఆధారపడుతున్నారని, వారి ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి పెండింగ్‌లో ఉన్న అన్ని పింఛన్లను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, హామీల అమలులో జాప్యం చేయడం ప్రజలను మోసం చేసినట్లేనని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రవీణ్



హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ పట్టణ నాయకులు నేరెళ్ల జోసెఫ్, మహేశ్, గోలి లావణ్య , ఎండి సాబిర్, గోనెల తిరుపతి, శరత్, గడ్డం స్వరూప, పెద్దమాముల సంధ్య, పల్లెర్ల రజిత, పోతుగంటి స్వప్న, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులు తీసుకుని ఇవ్వకుండా తిరుగుతున్న వ్యక్తి ఇంటి ఎదుట బాధితుల ఆందోళన.



**బయ్యారం,,జూన్ 7. ప్రజా జ్యోతి** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని కైరంకొండ గణేష్ 200 మంది గ్రామస్తుల దగ్గర నుండి సుమారు తొమ్మిది కోట్ల రూపాయలు తీసుకొని అ డబ్బులను ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఆదివారం గణేష్ ఇంటి ఎదుట బాధిత మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కూలి నాలి చేసుకుంటూ జీవనం గడుస్తున్న మా నుండి వడ్డీల ఆశ చూపి డబ్బులు తీసుకుని ఇవ్వడం లేదని,మా డబ్బులు తీసుకొని ఇవ్వకుండా కిరాణా వ్యాపారం చేసుకుంటున్నాడని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు అడగబోతే 100 కు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నట్లు వారు తెలిపారు. అప్పులు ఇచ్చి మానసికంగా మనోవేదనకు గురై నలుగురు మృత్యువాత పడినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా డబ్బులు మాకు ఇప్పించాలని వేడుకున్నారు. లేదంటే ప్రాపర్టీని అమ్మి మాకు డబ్బులు సెటిల్ చెయ్యాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసిన ఎస్ఐ ప్రశాంత్ బాబు తమ సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకొని బాధిత మహిళలకు నచ్చచెప్పి స్టేషన్ కు తరలించారు. దీనిపై ఎస్ఐ ప్రశాంత్ బాబుని వివరణ కోరగా విషయాన్ని సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎస్ఐ తెలిపారు.

## రాహుల్ 'ఆర్థిక సునామీ' వ్యాఖ్యలను ఖండించిన తుమ్మల శ్రీనివాస్.



**బయ్యారం,,జూన్ 7. ప్రజా జ్యోతి** దేశంలో త్వరలో 'ఆర్థిక సునామీ' రాబోతోందని,ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను ప్రకటించవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు తీవ్రంగా ఖండించారు. ఇవి కేవలం ప్రజల్లో భయాన్ని సృష్టించే ప్రయత్నాలని,భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను తట్టుకుని పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. గతంలో దేశాన్ని ఆర్థిక ఒత్తిళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కాపాడిన వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రాహుల్ ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు తప్పు మాత్రమే కాదు,ఇది కచ్చితంగా ప్రజల్లో భయాన్ని వ్యాప్తి చేయడమేనని తుమ్మల శ్రీనివాస్ విమర్శించారు. గత దశాబ్ద కాలంలో ఆర్థిక,రక్షణ వ్యవస్థలను బీజేపీ బలోపేతం చేసిందని గుర్తు చేశారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం,వాహన అమ్మకాలు,ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం,భారీ విదేశీ మారక నిల్వలు వంటివి దేశ ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని శ్రీనివాస్ పేర్కొన్నారు. సునామీ 2013లో వచ్చిందని ఇప్పుడు కాదని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ ఈ దేశంలో వినాశనాన్ని సృష్టిస్తే,బీజేపీ దృఢంగా ముందుకు సాగుతోందని అన్నారు. రాహుల్ గాంధీకి ఆయన నాయనమ్మ ఇందిరా గాంధీ విధించిన 1975 ఎమర్జెన్సీని గుర్తులేదా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారని వారు తెలిపారు. రాహుల్ పదేపదే ఇలాంటి హెచ్చరికలు చేస్తూ దేశంలో అస్థిరత సృష్టించాలని చూస్తున్నారని తుమ్మల శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు.

## బీర్కూర్‌లో సైబర్ మోసం.. రూ.95 వేలు పోగొట్టుకున్న యువకుడు

**నస్రుల్లాబాద్ :** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బీర్కూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు రూ.95వేలు పోగొట్టుకున్నాడు. బీర్కూర్ గ్రామానికి చెందిన మజార్ అనే యువకుడు బీర్కూర్ లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మే నెల 2న వాట్సాప్ గ్రూపులో ఆర్టీవో చలాన్ లింక్ వచ్చింది. యువకుడు ఆ లింక్ ని ఓపెన్ చేసి లింక్ అడిగిన వివరాలను నమోదు చేశాడు. జూన్ 3న తన ఖాతాలో రూ. లక్ష నగదును జమ చేశాడు. జూన్ 6న సాయంత్రం యువకుడి ఖాతాలో నుండి ఆరు దఫాలుగా మొత్తం రూ.95 వేల నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు. నగదు పోయిన వివరాలు మెసేజ్ రావడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బీర్కూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి, 1930కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బొగ్గు నిల్వలను చూసేందుకు వెళ్లిన మాజీ మంత్రి హరీష్ రావు.. అడ్డుకున్న పోలీసులు



**పెద్దపల్లి :** సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 సీఎస్పీలో ఉన్న బొగ్గు నిల్వలను చూసేందుకు వచ్చిన మాజీ మంత్రి హరీష్ రావును పోలీసులు అడ్డుకున్నారు. సింగరేణిలో భారీగా బొగ్గు మాయం అయ్యిందనే అంశంపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు బలం చేకూరే విధంగా ఆదివారం సాయంత్రం సి ఎస్ పీ కి వచ్చిన మాజీ మంత్రి హరీష్ రావు ను బొగ్గు నిల్వలను చూడకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. గోదావరిఖనిలో జరుగుతున్న సింగరేణి పరిరక్షణ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన హరీష్ రావు బొగ్గు నిల్వలను చూసేందుకు వచ్చిన క్రమంలో పోలీసులు అక్కడికి వెళ్లకుండా భారీ బందోబస్తుతో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ సింగరేణి ఆర్ జీవన్ లో సంస్థ చెప్పిన లెక్కల ప్రకారం 5 లక్షల టన్నుల బొగ్గు నిలువలు ఉండాల్సి ఉండగా 50వేలు కూడా లేదని తనకు సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు. అబద్ధాలను కప్పిపుచ్చుకోవడానికి పోలీసులు చూడకుండా అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మపాలెంలో ఘనంగా వెయిట్‌లిఫ్టింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు

## పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



**డోర్నకల్ జూన్ 7 ప్రజా జ్యోతి:-** అమ్మపాలెం గ్రామంలో నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పోటీల నిర్వహణ అనంతరం బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అమ్మపాలెం సర్పంచ్ శ్రీమతి కొపెల రాణి, ఉపసర్పంచ్ బోడపట్ల రాజేంద్ర ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. గ్రామీణ ప్రాంత యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవడం అభినందనీయమని, ఇటువంటి శిక్షణా శిబిరాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. క్యాంప్ ఇన్‌చార్జ్, మహబూబాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ కొత్త రాంబాబు మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే క్యాంప్ ప్రధాన లక్ష్యమన్నారు. క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణ పొందడం సంతోషకరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మండలోజు సుధాకర్, సీనియర్ వెయిట్‌లిఫ్టర్ మరబోయిన లక్ష్మీనారాయణ, సీనియర్ బాడీ బిల్డర్ చిర్రా నాగరాజు తదితరులు పాల్గొని క్రీడాకారులకు మార్గదర్శక సూచనలు చేశారు. క్యాంప్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట..!

## శంకుస్థాపనకే పరిమితమైన తట్టుపల్లి హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణం!

**రెండేళ్లు గడుస్తున్నా అడుగు ముందుకు పడని వైనం.**

**పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, జిల్లా వైద్యాధికారులు**

**గ్రామసభల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేసినా స్పందన కరువు**

**ప్రభుత్వాలు మారినా మారని తట్టుపల్లి ప్రజల వైద్య కష్టాలు.**



**కురవి,జూన్,07,(ప్రజాజ్యోతి),** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి గ్రామ ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం (హెల్త్ సబ్ సెంటర్) నూతన భవన నిర్మాణం అధికారుల, ప్రజాప్రతినిధుల తీవ్ర నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ చొరవతో వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ఈ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు అయ్యాయి. ఎంతో ఆర్భాటంగా 2023 అక్టోబర్ 4న శంకుస్థాపన కూడా పూర్తి చేశారు. అయితే, శంకుస్థాపన రాయి వేసి రెండేళ్లు గడుస్తున్నా, నేటికీ అక్కడ ఒక్క ఇటుక కూడా పడకపోవడంపై స్థానిక గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా మారని రాత..!**

రాష్ట్రంలో ప్రభుత్వం మారి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, స్థానిక ఎమ్మెల్యేగా రాంచంద్రు నాయక్ బాధ్యతలు స్వీకరించినప్పటికీ ఈ పనుల్లో ఎలాంటి చలనం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు కావస్తున్నా, స్థానిక ఎమ్మెల్యే ఈ నిలిచిపోయిన భవన నిర్మాణ పనులపై కనీస చొరవ చూపకపోవడం గమనార్హం. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల సమన్వయ లోపం, పర్యవేక్షణ కరువడం వల్లే ఈ పనులు గుత్తేదారు (కాంట్రాక్టర్) ప్రారంభించడం లేదని స్పష్టమవుతోంది. అసలు ఈ పనులను దక్కించుకున్న గుత్తేదారు ఎవరనే సమాచారం కూడా గ్రామ ప్రజలకు తెలియకుండా గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**గ్రామసభల తీర్మానాలకూ విలువ లేదా?**

గ్రామంలో ప్రత్యేక పాలన (స్పషల్ ఆఫీసర్) సాగిన సమయంలో నిర్వహించిన గ్రామసభలో ఈ నూతన భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆ తర్వాత గ్రామానికి నూతన పాలకమండలి కొలువుదీరిన అనంతరం జరిగిన 'ప్రజాపాలన' గ్రామసభలో సైతం వార్డు సభ్యులు, ప్రజలు కలిసి భవన నిర్మాణం చేపట్టాలని గట్టిగా తీర్మానించారు. గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ ముఖ్య నాయకులు పలుమార్లు ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. అయినప్పటికీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గానీ, కాంట్రాక్టర్ గానీ స్పందించకపోవడం గమనార్హం.

**అధికారుల నిర్లక్ష్యమా? గుత్తేదారు లీలలా?**

రూ. 20 లక్షలు ప్రభుత్వ నిధులు మంజూరై, అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఈ భవన నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఇది జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణా లోపమా? లేక అడ్వాన్స్ తీసుకుని పనులు చేయకుండా తప్పించుకుంటున్న గుత్తేదారు నిర్లక్ష్యమా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్లే గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అందుకే పనులు మొదలుపెట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు.

**ఎమ్మెల్యే గారు.., ఇప్పటికైనా స్పందించండి!**

గ్రామంలో సరైన వైద్య వసతులు లేక అత్యవసర పరిస్థితుల్లో కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని తట్టుపల్లి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ తక్షణమే స్పందించి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను, గుత్తేదారును గట్టిగా మందలించి, నిలిచిపోయిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తట్టుపల్లి గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# విద్య అభివృద్ధి కోసం పల్లెల్లో ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేసుకోండి.

## అందరూ సమిష్టిగా ఉంటే ఏదైనా సాధించగలం: ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్.

**మహిళా సమైక్య నూతన భవనాల శంకుస్థాపన చేసిన: ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్.**

**నియోజవర్గంలో 98 నూతన వివో భవనాలు.**



**డోర్నకల్, జూన్ 7 ప్రజా జ్యోతి:-** గ్రామీణ అభివృద్ధి మహిళా సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోద్ రామచంద్రనాయక్ పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిరా మహిళా శక్తి" పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 8,000 , డోర్నకల్ నియోజకవర్గంలో 98 గ్రామ మహిళా సమాఖ్య భవనాలు మంజూరు అయ్యాయి.ఆదివారం ఉమ్మడి కురవి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు బలపాల, లింగ్యాతండా గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా సమైక్య భవనాలను శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ మహిళలు ఆర్థికంగా సామాజికంగా మరింత బలపడేందుకు మహిళ సమైక్య పవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు ,స్వయం ఉపాధి ,శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ భవనాలు అభివృద్ధి కేంద్రాలుగా మారనున్నాయని చెప్పారు.గ్రామీణ మహిళలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని వెల్లడించారు. అందరం సమిష్టిగా ఉంటేనే ఏదైనా సాధించగలమని ప్రతి కార్యకర్త కలిసికట్టుగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి రైతు పంటలు మార్పిడి చేస్తూ, సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సహించాలని రైతును పిలుపునిచ్చారు. పామాయిల్ తాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందవచ్చు అని, ప్రభుత్వం నుండి సబ్సిడీలు కూడా పొందవచ్చును ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు మాలోత్ స్వరూప హరిలాల్ నాయక్,బాదావత్ బిక్కు నాయక్,ఏఎంసీ చైర్మన్ సుధాకర్ నాయక్, మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, టిపిసిసి డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్, వివిధ గ్రామాల సర్పంచ్లు నూకాల వేణుగోపాల్ రెడ్డి, బానోత్ శంకర్ నాయక్, బాలగాని శ్రీనివాస్, ఉప సర్పంచ్ పిట్టల వెంకన్న, వెంకట్ నారాయణ, నారాయణ, ఎస్సీ సెల్ గొల్లపల్లి రజనీకాంత్, రమేష్ శ్రీను, లక్ష్మ శంకర్, బద్రు, నెమలి ప్రసాద్, డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్, కోటిలింగం, తాళ్లూరి హనుమ, ఏపిఎం దుర్గారావు, పిఆర్ ఏఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, మాజీ ఎంపీటీసీ లింగ్యానాయక్ ,వార్డు సభ్యులు జ్యోతి, లక్ష్మి, డీలర్ హరి, మంజ్యాజి నాయక్, రంజిత్, నరేష్, మోహన్, బాబూలాల్, రాజ్ కుమార్, ఇందిరా, మహిళా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నంచర్లలో జామ తోట దగ్ధం



**పెగడపల్లి :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల గ్రామంలో గోలి రాజేందర్ రెడ్డి అనే రైతుకు చెందిన జామ తోట ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దద్దమైంది. గ్రామ సమీపంలోని తన వ్యవసాయ భూమిలో రాజేందర్ రెడ్డి రెండు ఎకరాల్లో జామ తోటను సాగు చేశారు. ఆదివారం ఉదయం తోట పక్కనే వదులుగా ఉన్న తీగలు గాలికి చెట్టుకు తగలడంతో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి జామ తోటకు అంటుకున్నట్టు తెలిపారు. దీంతో రెండు ఎకరాల్లోని జామ తోట పూర్తిగా దగ్ధమైందని బాధిత రైతు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేసే ఆదుకోవాలని రైతు రాజేందర్ రెడ్డి కోరారు.

## ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



**ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామానికి చెందిన మేకల సౌమ్య అనే విద్యార్థిని బాసరలో ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించగా ఆమెను గ్రామ సర్పంచ్ మోతే కనకయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. ధర్మారం మోడల్ స్కూల్ లో 2025- 26 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన సౌమ్య 600 మార్కుల గాను 562 మార్కులు సాధించింది. సదరు విద్యార్థికి ట్రిపుల్ ఐటీ లో సీటు వచ్చింది. దీంతో ఆదివారం విద్యార్థిని సౌమ్యను ఆ గ్రామంలో సర్పంచ్ మోతె కనకయ్య ఆధ్వర్యంలో స్థానికుడు మోతె వెంకటేష్, వార్డు సభ్యులు తోడేటి సాగర్ శాలువాతో సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనకయ్య మాట్లాడుతూ విద్యార్థిని సౌమ్య ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఉన్నత విద్యను ధర్మారం మోడల్ స్కూల్లో చదివి టెన్త్ లో 562 మార్కులు సాధించడం హర్షనీయమని అన్నారు. సౌమ్య తండ్రి ఉపాధి కోసం గల్ఫ్ దేశంలో ఉండటం, తల్లి గ్రామంలో కూలీగా పనిచేస్తుందని వారి శ్రమను గుర్తించి రేయింబవళ్ళు కష్టపడి చదివి బాసర ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించడం ఆనందదాయకంగా ఉందని ఆయన కొనియాడారు. విద్యార్థిని సౌమ్య స్ఫూర్తితో గ్రామంలోని మిగతా విద్యార్థులు టెన్త్ లో టాప్ మార్కులు సాధించి బాసరలో సీటు సాధించేందుకు ప్రయత్నించాలని సర్పంచ్ కనకయ్య సూచించారు.

## రామగుండం బల్దియాలో సండే సందడి.. ఆసనాలు.. ఆటలతో గడిపిన అధికారులు, ప్రజా ప్రతినిధులు



**కోల్ :** రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో హ్యాపీ సండే సందడి నెలకొంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆసనాలు.. ఆటలు పాటలతో ఆనందంగా గడిపారు. ఆరోగ్య కరమైన జీవనాన్ని ప్రోత్సహించడానికి 'హ్యాపీ సండే' కార్యక్రమం అవసరమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత మార్చి నెలలో కూడా ఈ హ్యాపీ సండే కార్యక్రమాన్ని గోదావరి నది లో చెత్త ఏరి వేసిన తరువాత క్రీడా పోటీలు నిర్వహించి ఘనంగా చేపట్టినట్లు చెప్పారు. డిజిటల్ స్క్రీన్స్ కు అలవాటు పడి శారీరక , మానసిక సామర్థ్యాన్ని పెంచే యోగా, క్రీడలలో ప్రజలు భాగస్వాములు కాకపోవడం వల్ల రోగాల బారిన పడి హాస్పిటల్ చుట్టూ తిరుగుతూ డబ్బులు ఖర్చు పెట్టు కోవాల్సిన దుస్థితి అలాగే అనేక ఇబ్బందులు పడే పరిస్థితి కూడా తలెత్తుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో మెట్రో నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ కార్యక్రమాన్ని స్థానికంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్యం పై ఇప్పటికే కొంత మేర స్పృహ వచ్చిశీదని నగరంలోని మైదానాలలో చాలా మంది కనిపిస్తున్నారని అన్నారు. ఇది శుభ పరిమాణమని అన్నారు. రామగుండం నగరాన్ని ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దె ఎం ఎల్ ఎ ప్రయత్నం లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ , నగర పాలక సంస్థ టీపీఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , సీనియర్ అసిస్టెంట్ శ్రీ పాల్ , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , మెప్మా టి ఎం సి మౌనిక , యోగా గురు గణేష్, వ్యాయమ ఉపాధ్యాయులు శోభారాణి, తిరుపతి,దావీద్ సీవోలు, ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో భాగంగా యోగాతో పాటు కబడ్డీ, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలకు మెమెంటో, బహుమతుల ప్రదానం చేశారు.

## బిజినెస్

### దిగివస్తున్న బంగారం ధర.. వరుసగా మూడో రోజూ తగ్గుముఖం..!



దేశంలో బంగారం ధరలు వరుసగా మూడో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలకు తోడు దేశీయంగా డిమాండ్ మందగించడంతో పసిడి ధరలు దిగివస్తున్నాయి. జూన్ 7 నాటి ట్రేడింగ్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.300 తగ్గి.. రూ.1,52,730 వద్దకు చేరింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. నగరంలో కిలో వెండి ధర రూ.2.7 లక్షలుగా నమోదైంది. విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే.. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,54,910గా ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,000గా ఉంది. ముంబైలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,730 వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,40,150 వద్ద కొనసాగుతోంది. శనివారం భారత మార్కెట్లో మేలిమి బంగారం సగటు ధర రికార్డు స్థాయిలో రూ.3,000 మేర తగ్గగా.. వెండి ధరలోనూ రూ.10 వేల మేర తగ్గుదల నమోదైంది.

### కస్టమర్ల కోసం టీవీఎస్ కొత్త కాన్సెప్ట్!



భారతదేశంలోని ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ అయిన టీవీఎస్ మోటార్ కంపెనీ 'టీవీఎస్ ప్యాడాక్' అనే కొత్త ప్రీమియం రిటైల్ నెట్‌వర్క్‌ను ప్రారంభించింది. ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కంపెనీ దీనిని స్టార్ట్ చేసింది. టీవీఎస్ ప్యాడాక్ ద్వారా వినియోగదారులు సాధారణ షోరూమ్ కంటే మంచి ఎక్స్‌పీరియన్స్ పొందవచ్చు. ఈ ప్రీమియం అవుట్‌లెట్లను లండన్‌కు చెందిన చెక్‌ల్యాండ్ కిండ్లీసైడ్స్ సంస్థ రూపొందించింది. ఇందులో కొత్త ప్రీమియం బైకుల ప్రదర్శన ఉంటుంది. అంతే కాకుండా.. వినియోగదారులకు ప్రత్యేక సలహాలు ఇచ్చే కన్సల్టేషన్ జోన్లు, బ్రాండ్‌కు సంబంధించిన మెర్చండైజ్ వస్తువులు, సర్వీస్ సదుపాయాలు అన్నీ అందుబాటులో ఉంటాయి. అయితే.. తొలి టీవీఎస్ ప్యాడాక్ అవుట్‌లెట్లు 2027 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో ప్రారంభమవుతాయని కంపెనీ వెల్లడించింది. ఆ తరువాత దశలవారీగా వీటిని దేశం మొత్తం విస్తరించే అవకాశం ఉంది.

# కొత్త కారు కొనాలనే వారికి గుడ్‌న్యూస్.. భారీ డిస్కౌంట్లు ప్రకటించిన కంపెనీలు!

**న్యూఢిల్లీ :** కొత్త కార్లను కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే ఇది మీకు శుభవార్త. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలు ఒకేసారి భారీగా రాయితీని ఇస్తున్నట్టు ప్రకటించాయి. మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్‌లు ఏకంగా తమ మాడళ్లపై రూ.2.15 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు వెల్లడించాయి. ఈ ఆఫర్లు ప్రస్తుత నెలకు మాత్రమే వర్తించనున్నాయని, వీటిని నగదు డిస్కౌంట్, ఎక్స్చేంజ్ బోనస్, స్క్రాపింగ్ ఇన్సెంటివ్స్, లాయల్టీ రివార్డ్, కార్పొరేట్ ప్రయోజనాలు కలుపుకొని ఎంపిక చేసిన మాడళ్లపై రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపాయి.



**హ్యుందాయ్..**

హ్యుందాయ్ మోటర్స్ ఎంపిక చేసిన మాడళ్లపై లక్ష రూపాయల వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నది. క్రెటా ఎస్‌యూవీని కొనుగోలు చేసిన వారికి లక్ష రూపాయల వరకు డిస్కౌంట్ ఇస్తున్న సంస్థ..వెర్నాపై రూ.95 వేలు, అప్‌డేటెడ్ మాడల్‌పై రూ.55 వేలు, క్రెటా ఎలక్ట్రిక్ మాడల్‌పై రూ.85 వేల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని ఆటోకార్ ఇండియా తాజాగా వెల్లడించింది. వీటితోపాటు గ్రాండ్ ఐ10 నియోస్‌పై రూ.78 వేలు, అల్కాజర్‌పై రూ.75 వేలు, ఐ20, ఐ20 ఎన్ లైన్ మాడల్‌పై రూ.63 వేలు, ఎక్సటర్‌పై రూ.43 వేల డిస్కౌంట్, ఔరా మాడల్‌పై రూ.25 వేలు, వెన్యూపై రూ.5 ప్రయోజనాలు కల్పిస్తున్నది.

**టాటా మోటర్స్...**

పలు ప్యాసింజర్ వాహనాలపై రూ.55 వేల వరకు రాయితీ ఇస్తున్నట్టు టాటా మోటర్స్ ప్రకటించింది. ఈ ఆఫర్లు 2026లో విడుదలైన ఎస్‌యూవీలు, పంచ్, టియాగో మాడళ్లు ఉన్నాయి. వీటిలో నెక్సాన్‌పై రూ.55 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్న సంస్థ..కర్వ్‌పై రూ.55 వేలు, హారియర్, సఫారీ ఎస్‌యూవీపై రూ.45 వేల వరకు, అల్ట్రోజ్ రూ.40 వేల వరకు, టియాగోపై రూ.35 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది.

**మారుతి కార్లపై**

మారుతి సుజుకీ కూడా రాయితీలను ప్రకటించింది. ఇన్విక్టో ఎంపీవీ పై రూ.2.15 లక్షల వరకు రాయితీ ఇస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. దీంతోపాటు గ్రాండ్ విటారాపై రూ.1.35 లక్షల వరకు, ఇగ్నిస్‌పై రూ.45 వేలు, బాలెనోపై రూ.40 వేలు, ఎక్స్‌ఎల్ఆర్‌పై రూ.45 వేలు, జిమ్నీపై రూ.45 వేలు, ఫ్రాంక్స్‌పై రూ.25 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. వీటిలో ఎక్స్చేంజ్ బోనస్, లాయల్టీ రివార్డులు, కార్పొరేట్ డిస్కౌంట్లు ఇస్తున్నది.

# ఐటీ రిటర్నుల ఫైలింగ్‌కు వేళాయే..

ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ సీజన్ ప్రారంభమైంది. ఉద్యోగులు, ఇండివిడ్యువల్స్.. ఐటీఆర్-1 (సహజ్) ద్వారా, ఆడిట్ అవసరం లేని వృత్తి నిపుణులు, చిన్న చిన్న వ్యాపారాలు ఉన్న వ్యక్తులు ఐటీఆర్-4 (సుగమ్) తో ఆదాయ పన్ను శాఖ 'ఈ ఫైలింగ్' పోర్టల్ ద్వారా తమ ఐటీ రిటర్నులు ఫైల్ చేయాలి. అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై) 2026-27కి సంబంధించి పన్ను మినహాయింపు పరిమితులు, పాన్‌తో ముడిపడి ఉన్న లావాదేవీలు, ట్యాక్స్ డిడక్షన్లు, టీడీఎస్ పరిమితులు, పెనాల్టీల రూల్స్‌లో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. తమ ఐటీ రిటర్నులు దాఖలు చేసే ముందే ఉద్యోగులు, వ్యాపారులు, సీనియర్ సిటిజన్లు, మదుపరులు ప్రధానంగా వచ్చిన మార్పులను అర్థం చేసుకోవాలి. లేకపోతే అనేక సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఈ కింది మార్పులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాత ట్యాక్స్ విధానంలో తమ ఐటీ రిటర్నులు ఫైల్ చేసే వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్ (ఏఓపీలు), బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్ (బీఓఐ)ల వార్షికాదాయంలో రూ.2.5 లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది.

60 నుంచి 80 ఏళ్ల మధ్య వయసు ఉన్న రెసిడెంట్ సీనియర్ సిటిజన్లకు వారి వార్షికాదాయంలో రూ.3 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు లభిస్తుంది.

80 ఏళ్లు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్లకు వారి వార్షికాదాయంలో రూ.5 లక్షల వరకు పన్ను మినహాయింపు

అదే కొత్త పన్ను విధానంలో రిటర్నులు ఫైల్ చేస్తే సెక్షన్ 115 బీఏసీ కింద రూ.4 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది.




స్టాండర్డ్ డిడక్షన్

ఉద్యోగులు, పెన్షనర్లకు పాత పన్ను విధానంలో అయితే రూ.50,000 వరకు, కొత్త పన్ను విధానంలో రూ.75,000 వరకు స్టాండర్డ్ డిడక్షన్ లభిస్తుంది. ఉద్యోగులు కొత్త ట్యాక్స్ విధానానికి మారడాన్ని ప్రోత్సహించేందుకు ఆ విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను ఎక్కువగా అనుమతించారు.

సెక్షన్ 80సీ కింద ఈ కింది పెట్టుబడులు, చెల్లింపులకు చేసే రూ.1.5 లక్షల వరకు మినహాయింపు ఇస్తారు.

పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడులు
ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపులు
పిల్లల ట్యూషన్ ఫీజులు, గృహ రుణ అసలు చెల్లింపులు

'పాన్' ఎప్పుడు తప్పనిసరి?

బ్లాక్‌మనీకి చెక్ పెట్టేందుకు అధిక విలువ (హైవాల్యూ) కలిగిన లావాదేవీలకు 'పాన్' నంబర్ కోట్ చేయడాన్ని తప్పనిసరి చేశారు.

రూ.10 లక్షలకు మించిన ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు
రూ.50,000 పైబడిన హోటల్, రెస్టారెంట్ల బిల్లులు
రోజువారీ నగదు డిపాజిట్లు రూ.50,000 మించితే
రూ.2 లక్షలకు మించిన వస్తు, సేవల కొనుగోళ్లు
రూ.2 లక్షలకు మించిన విదేశీ ప్రయాణ ఖర్చులు

# హ్యాట్రిక్‌తో చెలరేగిన షమీ.. మరోసారి సెలెక్టర్లకు సవాల్

భారత క్రికెట్‌లో గత కొంతకాలంగా తీవ్ర అన్యాయానికి గురవుతున్న ఆటగాడు ఎవరైనా ఉన్నారా అంటే, అది మహ్మద్ షమీయే అని చెప్పాలి. ఎందుకంటే ఇతగాడు ఫార్మాట్లకతీతంగా ఎంత అద్భుతంగా రాణించినా, జాతీయ జట్టులోకి తిరిగి రాలేకపోతున్నాడు. హర్షిత్ రాణా లాంటి బౌలర్ ఏమీ సాధించకపోయినా, ప్రతిసారి జట్టులో దర్శనమిస్తున్న వేల, షమీకి జరుగుతున్న అన్యాయంపై కొందరు తీవ్రస్థాయిలో గళమెత్తుతున్నారు. హర్షిత్‌కు ఉన్న అర్హతలేంటి, షమీకి లేనివేంటి అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై బీసీసీఐని, సెలెక్టర్లను, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను నిలదీస్తున్నారు. తాజాగా ఐర్లాండ్, ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లతో పాటు ఆసియా క్రీడలకు భారత జట్టును ప్రకటించగా.. షమీకి మరోసారి మొండిచెయ్యే ఎదురైంది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో అద్భుత ప్రదర్శనలు



చేసినా, సెలెక్టర్లు షమీని పరిగణలోకి తీసుకోలేదు. తాను లేని భారత జట్లను ప్రకటించిన గంటల వ్యవధిలోనే షమీ హ్యాట్రిక్ వికెట్లు తీసి సెలెక్టర్లకు సవాల్ విసిరాడు. బెంగాల్ టీ20 లీగ్ 2026లో భాగంగా నిన్న జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్‌ను సాధించాడు. ఈ టోర్నీలో సిలిగురి స్ట్రయికర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న షమీ.. రార్ టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో వరుస మూడు బంతుల్లో మూడు వికెట్లు తీశాడు. మొదటగా తన ఐపీఎల్ సహచరుడు షాబాజ్ అహ్మద్‌ను ఔట్ చేసిన షమీ.. ఆ తర్వాతి రెండు బంతుల్లో రోహిత్ కుమార్, దీపాంజన్ ముఖర్జీ వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా నాలుగు ఓవర్లలో 27 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీశాడు. షమీ (4/27)తో పాటు కరణ్ లాల్ (3/36) అద్భుత బౌలింగ్ చేయడంతో రార్ టైగర్స్‌పై సిలిగురి స్ట్రయికర్స్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన స్ట్రయికర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేయగా.. ఛేదనలో షమీ, కరణ్ లాల్ ధాటికి తడబడిన రార్ టైగర్స్ 9 వికెట్లు కోల్పోయి 184 పరుగులకే పరిమితమైంది.

# సూర్యకుమార్ యాదవ్ రిటైర్మెంట్!?

భారత క్రికెట్‌లో కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ ప్రస్థానం ముగిసింది. టీమిండియా టీ20 కెప్టెన్సీ బాధ్యతల నుంచి సూర్యకుమార్‌ను బీసీసీఐ సెలక్షన్ కమిటీ తప్పించింది. అతడి స్థానంలో మరో ముంబై ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించారు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు ఆసియా క్రీడలకు ప్రకటించిన భారత జట్లలో సూర్యకుమార్‌కు కనీసం ఆటగాడిగా కూడా చోటు దక్కించుకోలేకపోయాడు. పేలవ ఫామ్ కారణంగానే సెలక్టర్లు ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు. భారత్‌కు ఆసియాకప్, టీ20 ప్రపంచకప్‌ను అందించినప్పటికి అతడి ఫామ్ మాత్రం దారుణంగా పడిపోయింది. ఐపీఎల్-2026లోనూ సూర్య రాణించలేకపోయాడు. ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన సూర్యకుమార్ 13 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 270 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ కారణాలతో అతడిని జట్టు నుంచి తప్పించారు.

**సూర్య రిటైర్మెంట్ ప్రకటించనున్నాడా?**

అయితే సూర్యకుమార్‌పై వేటు పడిన కొద్దిసేపటికే అతడికి సంబంధించి ఒక పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. "భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన గొప్ప గౌరవం. విమర్శలు, ఆన్‌లైన్ ట్రోలింగ్ వల్ల తీవ్ర నిరాశకు గురయ్యాను. అందుకే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నాను" అంటూ సూర్యకుమార్ పేరుతో ఉన్న ఒక ఎక్స్ (ట్విట్టర్) ఖాతా స్క్రీన్‌షాట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. అయితే అది ఫేక్ పోస్ట్ అని తేలింది. ఏబఅతీమ్ముశ్రీబింఎఎం అనే ఒక ఫేక్ అకౌంట్ నుంచి ఎవరో ఆకతాయి చేసిన పోస్ట్ అది. అంతే తప్ప స్కై నుంచి కానీ బీసీసీఐ నుంచి కానీ అతడి రిటైర్మెంట్‌కు



సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. సూర్య ప్రస్తుతం ముంబై టీ20 లీగ్‌లో ఆడుతున్నాడు.

## స్పోర్ట్స్

### తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన టీమిండియా



**హైదరాబాద్ :** న్యూ చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో(౧వర్ ఎఫ్ఎష్ట్ర) శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ సాధించిన శతకాలతో టీమిండియా భారీ స్కోర్ చేసింది. భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ (177 బంతుల్లో 126, 15ఫోర్లు, 1సిక్స్), కేఎల్ రాహుల్(100), సెంచరీలు సాధించగామూడో స్థానంలో బ్యాటింగ్ చేయడానికి వచ్చిన సాయి సుదర్శన్ (81), రిషబ్ పంత్ (81), వాషింగ్టన్ సుందర్(52) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. హైదరాబాద్ వార్తలు అఫ్గానిస్థాన్ బౌలర్లలో సలీమ్ సాఫి 6 వికెట్లతో చెలరేగాడు. రెహమాన్ షరీఫీ, హష్మతుల్లా షాహిదీ తలొక వికెట్ పడగొట్టారు. కాగా, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై లభించిన అవకాశాన్ని యశస్వి జైస్వాల్సద్వినియోగం చేసుకోలేకపోయాడు.సఫీ బౌలింగ్‌లో (24) పరుగులకే వెనుదిరిగాడు.



# చిరంజీవి-బాబీ మూవీలో కన్నడ బ్యూటీ రచితా రామ్!

మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మెగా158' సినిమా గురించి ఒక ఆసక్తికరమైన కాస్టింగ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్ర కోసం మొదట మలయాళ బ్యూటీ హనీ రోజ్‌ను అనుకున్నారు. అయితే డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుని, అడ్వాన్స్ కూడా వెనక్కి ఇచ్చేసిందని ఇండస్ట్రీ టాక్. ఇప్పుడు ఆ కీలక పాత్ర కోసం కన్నడ స్టార్ హీరోయిన్ రచితా రామ్‌ను మేకర్స్ ఫైనల్ చేసినట్లు తెలుస్తుంది. గతంలో 'సూపర్ మచ్చి' చిత్రంలో నటించిన రచితకు తెలుగులో ఇది రెండో సినిమా. కూలీ సినిమాతో రచితకు మంచి గుర్తింపు రాగా.. ఈ సినిమా మరింత ప్లస్ కాబోతుందని సమాచారం. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కొల్లి కాంబోలో వస్తున్న ఈ చిత్రంలో చిరు కూతురిగా మలయాళ యంగ్ బ్యూటీ అనస్వర రాజన్ నటిస్తుండగా, ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ తమిళనాడులోని పొల్లాచ్చి పరిసర ప్రాంతాలలో శరవేగంగా జరుగుతోంది



# త్రిషకు సీక్రెట్‌గా పెళ్లయిందా?.. నెట్టింట వైరల్‌గా మారిన 'మంగళసూత్రం' ఫొటో!

సౌత్ స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ పెళ్లిపై సోషల్ మీడియాలో మరోసారి ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఆమె మెడలోని ఒక లాకెట్ ఇప్పుడు నెట్టింట తీవ్ర దుమారం రేపుతోంది. ఒక ఫొటోలో త్రిష ధరించిన పెండెంట్‌ను నిశితంగా గమనించిన నెటిజన్లు, అది వంద శాతం కేరళ క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో ఉండే 'మిన్ను' (మంగళసూత్రం) అని వాదిస్తున్నారు. దీంతో ఇంటర్నెట్‌లో ఒక్కసారిగా ఊహాగానాలు ఊపందుకున్నాయి. అసలు త్రిషకు సీక్రెట్‌గా పెళ్లయిపోయిందా? పెళ్లికూతురు ఇక్కడే ఉంది కానీ పెళ్లికొడుకు ఎక్కడ? అంటూ అభిమానులు, నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అయితే, ఇది కేవలం ఏదైనా సినిమా షూటింగ్‌కు సంబంధించిన లుక్ అయ్యుండవచ్చని, లేదా సాధారణ జ్యువెలరీ డిజైన్ అయ్యుండవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలో కూడా త్రిష పెళ్లిపై అనేక రూమర్స్ రాగా, ఆమె వాటిని కొట్టిపారేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి ఈ వైరల్ పిక్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అయితే దీనిపై త్రిష టీమ్ ఇప్పటివరకు స్పందించలేదు.

# షూటింగ్‌లో కో-స్టార్ వేధింపులు.. 'నాకు ముద్దు పెడుతూనే ఉన్నాడంటూ' బాలీవుడ్ నటి ఆవేదన



బాలీవుడ్, మరాఠీ చిత్ర పరిశ్రమలలో గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియా బాపట్ తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని తాజాగా పంచుకుంది. తన మొదటి సినిమా షూటింగ్ సమయంలో ఒక పాట చిత్రీకరణలో సహ నటుడు తనకు నచ్చకపోయినా పదే పదే ముద్దు పెట్టుకున్నాడని, ఆ సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని ఆమె వెల్లడించారు. కథా చర్చల సమయం నుంచే తాను ఆ ముద్దు సీన్ అవసరమా అని దర్శకుడిని ప్రశ్నించానని, అయితే షూటింగ్ స్పాట్‌లో మాత్రం సదరు నటుడు స్క్రిప్ట్‌లో లేని విధంగా, ఇంప్రూవైజేషన్ పేరుతో హద్దులు దాటి ప్రవర్తించాడని ప్రియా బాపట్ పేర్కొన్నారు. ఆ సమయంలో ఏం చేయాలో తోచక, తన గొంతు ఎలా వినిపించాలో తెలియక ఎంతో నిస్సహాయంగా ఉండిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందికరమైన వాతావరణం కేవలం షూటింగ్‌తోనే ముగిసిపోలేదని, తామిద్దరూ ఒకే హోటల్‌లో బస చేసినప్పుడు, తాను ఎన్నిసార్లు నిరాకరించినా ఆ నటుడు బ్రేక్‌ఫాస్ట్ లేదా డిన్నర్‌కు రమ్మంటూ పదే పదే వేధించాడని ప్రియ తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన తాను ప్రతిరోజూ రాత్రి తన భర్త ఉమేష్ కామత్‌కు ఫోన్ చేసి ఏడ్చేదాన్నని, దాంతో ఆందోళన చెందిన ఆయన వెంటనే ముంబై నుండి భోపాల్ షూటింగ్ స్పాట్‌కు వచ్చి మూడు రోజుల పాటు తనతోనే ఉన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 'మున్నాభాయ్ ఎంబీబీఎస్' చిత్రంతో పాటు 'సిటీ ఆఫ్ డ్రీమ్స్' వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియా బాపట్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి

# 'బిగ్‌బాస్' ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్.. 10వ సీజన్ వచ్చేస్తోంది




'బిగ్‌బాస్' అభిమానులకు గుడ్ న్యూస్. బిగ్‌బాస్ 10వ సీజన్ రాబోతుంది. ఇప్పటికే 9 సీజన్లను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న ఈ బిగ్ రియాల్టీ షో.. త్వరలోనే 10వ సీజన్‌తో ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతోంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఓ స్పెషల్ వీడియోని విడుదల చేశారు నిర్వాహకులు. 10వ సీజన్‌కు కూడా కింగ్ నాగార్జుననే హోస్ట్‌గా వ్యవహరించబోతున్నాడు. 'బిగ్‌బాస్.. ఎన్నో యుద్ధాలు గెలుచుకున్న రాజ్యం మాత్రమే కాదు, ఎంతోమంది హృదయాలు గెలుచుకున్న మహా సామ్రాజ్యం'అంటూ నాగార్జున చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్‌తో స్పెషల్ వీడియో ప్రారంభం అవుతుంది. బిగ్‌బాస్‌పై రూపొందించిన ఓ ప్రత్యేక పాటతో వీడియో ఆద్యంతం అలరించేలా సాగుతుంది. చెదరని ప్రస్థానం..తరగని అభిమానం బిగ్‌బాస్ సొంతం. ఈ ప్రస్థానం ఇంకో కొత్త చాప్టర్‌కి సాక్ష్యం కాబోతుంది. ఈ సారి మీరు చూడబోయేది బిగ్‌బాస్ దశావతారం' అంటూ సీజన్ 10పై ఆసక్తిని పెంచేశాడు నాగార్జున. ఇక ప్రతి సీజన్ ఏదో ఒక క్యాప్షన్‌తో వచ్చే బిగ్‌బాస్.. ఈ సారి కూడా 'ఆటలో సవాలు కాదు.. ఆటే సవాలు' అనే క్యాప్షన్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే షో ఎప్పుడు ప్రారంభం అవుతుంది? కంటెస్టెంట్స్ ఎవరనే విషయాలను మాత్రం ప్రకటించలేదు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-14-38, Yadavanagar, Hanmakonda, Warangal District-506001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35559 Ph.No. 9440231967